చెరువు స్థలాలను కాజేస్తున్నారు..


పీర్జాదిగూడ పెద్దచెరువులో మట్టితో నింపి చదును చేస్తూ..


ఉప్పల్ నల్ల చెరువును మట్టితో పూడుస్తూ..

- రోజుకు కొంత మట్టితో నింపి స్థలం కబ్జా
- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాలను కలుపుకొని..
- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణల పర్వం
- ఎన్నికల సమయంలో పట్టించుకోని అధికారులు
- నగర శివారుల్లో పలుచోట్ల అక్రమ నిర్మాణాలు
- అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జనం ఆగ్రహం

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారులో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు అర్బన్, సెమీ అర్బన్ పట్టణాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలుగా వేగంగా విస్తరిస్తుండటంతో అక్రమార్కుల కళ్లు చెరువులపై పడ్డాయి. వీటిని ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. రాజకీయ పలుకుడి ఉన్న వారైతే ఏకంగా చెరువులు, కుంటల సమీపంలో ఎకరం లేదా అరెకరం పట్టా భూమిని కొనుగోలు చేసి, పక్కనున్న బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాన్ని కలుపుకొని అపార్టుమెంట్లు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులను నిర్మిస్తున్నారు. పట్టణాల్లో ఇప్పటికే సగానికిపైగా చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అయ్యాయి. వీటిని పరిరక్షించాల్సిన నీటిపారుదల, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది.

చెరువుల పరిరక్షణ కమిటీలు ఉన్నా..

చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి కాపాడేందుకు ప్రతి జిల్లాలో చెరువుల పరిరక్షణ కమిటీ వేసి పరిరక్షించాలని గతంలో హైకోర్టు పేర్కొంది. అందు కోసం కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ కమిటీలో పోలీసు అధికారులకు స్థానం కల్పించాలని ఆదేశించింది. కానీ మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో చెరువుల పరిరక్షణ కమిటీలు ఉన్నా.. నామమాత్రంగానే పని చేస్తున్నాయి. పంచాయతీలు, పట్టణాల్లో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను ఇప్పటికీ ఈ కమిటీలు పూర్తిస్థాయిలో గుర్తించలేదు. కొన్నిచోట్ల గుర్తించినా ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లతో వాటిని తొలగించడం లేదు.

చెరువుల సరిహద్దులు గుర్తించినా..

శివారు జిల్లాలో ఏడు నగర పాలక సంస్థలు, 21 మున్సిపాలిటీలతో సహా గ్రామ పంచాయతీల పరిధిలో 552 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 476 చెరువులు, కుంటలు, నాలాల సరిహద్దులు గుర్తించే ప్రక్రియలో భాగంగా మూడు శాఖలు సంయుక్తంగా జీపీఎస్ విధానంలో శాటిలైట్ సర్వే నిర్వహించి, సంబంధిత వివరాలను హెచ్‌ఎండీఏకు నివేదించింది.

మచ్చుకు కొన్ని..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో రా, చింతల చెరువుల్లోని బఫర్ జోన్లలో బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా.. పట్టించుకునే వారే లేరు. అల్వాల్ మండలం యాప్రాల్లో బడాయికుంటను ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. రాంపల్లిలోని ఎర్రమల్లె వాగును ఆనుకుని ఉన్న ఎకరన్నర బఫర్ జోన్ స్థలాన్ని లేఅవుట్ చేసినా నీటి పారుదల శాఖ కిమ్మనడం లేదు. ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌లో రెండు నాలాలను ఆక్రమించి వెంచర్ చేసినా పట్టించుకోవడం లేదు. ఫీర్జాదిగూడలో పెద్దచెరువు, ఉప్పల్‌లో నల్లచెరువు భూములు కూడా ఆక్రమణకు గురయ్యాయి. ఇదే పరిస్థితి దమ్మాయిగూడ, జవహర్‌నగర్, నాగారం, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్, మేడ్చల్, దుండిగల్, కొంపెల్లి, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాలతో సహా సెమీ అర్బన్లుగా మారుతున్న గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పలు చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.

నేడు కల్యాణ మండపానికి భూమిపూజ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ –2లోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణ మండపానికి భూమిపూజ చేయనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామల భాస్కర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొననున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భూమిపూజ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా


బస్తీ దవాఖానాను సందర్శిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్ కాలనీలోని బస్తీ దవాఖానాను గురువారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడి రోగులకు అందిస్తున్న చికిత్సల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం ఉంటే వెంటనే టెస్టులు చేయించుకొని వైద్యుల సలహా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 28న ఇనార్బిట్ దుర్గం చెరువు రన్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పేరొందిన మారథాన్‌లలో ఒకటైన ఇనార్బిట్ దుర్గం చెరువు రన్ (ఐడీసీఆర్)లో పాల్గొనేందుకు పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విషయాన్ని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 28న జరుగనున్న ఈ రన్ ద్వారా సేకరించిన నిధులను దివ్యాంగుల, నిరుపేద ఆడపిల్లల విద్యాభ్యాసం.. వంటి సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నామని, నిర్మాణ్ తదితర ఎన్‌జీఓల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ రన్‌ను దివ్యాంగులే జెండా ఊపి ప్రారంభించనున్నారని వివరించారు. ఈ రన్ ఇనార్బిట్ మాల్ దగ్గర ప్రారంభమై మైండ్‌స్పేస్‌లోని బిజినెస్ పార్క్ దగ్గర ముగుస్తుందన్నారు.

కెప్టెన్ రత్నాజీకి మేజర్‌గా పదోన్నతి



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న కెప్టెన్ డి. రత్నాజీకి మేజర్‌గా పదోన్నతి లభించింది. నాగ్‌పూర్‌లోని ప్రతిష్టాత్మక ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 30 రోజుల కఠోర శిక్షణను పూర్తి చేసుకొని మేజర్‌గా పదోన్నతి పొందిన రత్నాజీకి 4వ తెలంగాణ బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ మగేంద్రన్ చేతుల మీదుగా మేజర్ ర్యాంకును స్వీకరించారు. మేజర్ రత్నాజీని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, కరస్పాండెంట్ రవీందర్‌రావు, కళాశాల సిబ్బంది అభినందించారు. ఈ పదోన్నతి తనపై మరింత బాధ్యతన పెంచిందని ఎన్‌సీసీ క్యాడెట్ల ఉన్నతికి, అభివృద్ధికి కష్టపడి పనిచేస్తానని మేజర్ రత్నాజీ తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


రాజుకాలనీ గాంధీ బొమ్మ వద్ద పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బాలానగర్: బాలానగర్ డివిజన్ రాజుకాలనీ గాంధీ బొమ్మ వద్ద సీసీరోడ్డు పనుల నాణ్యతను జీహెచ్ఎంసీ ఏఈ రషీద్‌తో కలిసి గురువారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, స్థానిక నాయకులు వెంకటేష్‌గౌడ్, మహంకాళి సూర్యనారాయణ, రంగంపేట్ శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



గ్లోరియస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్ కాలనీ డివిజన్ శంషీగూడ, ఆదర్శనగర్‌లోని గ్లోరియస్ చర్చిలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై ప్రార్థనలు చేశారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లకు, చర్చి సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ పి. ఇశ్రాయేలు, ఎం. రాజు, ఎంఎం సురేష్‌కుమార్, ఎం. సత్యరాజు, ఎం.శ్యామ్ జాషువా, సీహెచ్. ఫిలిప్, నాగభూషణం, దేవదాస్, ముకేశ్, సుమన్, సుశీల్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను సేకరణలో లక్ష్యాలను సాధించాలి


జోనల్ కార్యాలయంలో కమిషనర్లతో సమావేశంలో పాల్గొన్న జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమత గురువారం డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్‌లు, ఏఎంఓహెచ్‌తో సమావేశం నిర్వహించారు. ఆస్తిపన్ను సేకరణలో నెలవారి లక్ష్యాలను సాధించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ సేకరణను మెరుగుపర్చాలని తెలిపారు. ఇంటింటికీ చెత్త సేకరణ, స్వచ్ఛ ఆటోలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అందుబాటులోకి అలుమ్ని తాత్కాలిక కార్యాలయం

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఆవరణలో అలుమ్ని నూతన కార్యాలయం వైస్‌చాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈనెల 22, 23వ తేదీల్లో పూర్వ విద్యార్థుల సదస్సు కోసం పలు దేశాల నుంచి వచ్చే వారి అవసరాలు తీర్చే విధంగా తాత్కాలిక భవనం ఏర్పాటు చేశారు. అల్యూమ్ని డైరెక్టర్ డా. జే.సురేష్‌కుమార్ యూనివర్సిటీకి చెందిన ఉన్నతాధికారులు, యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులను వలంటీర్స్‌గా నియామకం చేశారు.

◆ ఈ సందర్భంగా వీసీ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థుల సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రెండు రోజుల పాటు అందరూ అంకిత భావంతో వచ్చే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యాలయం కొద్ది కాలం మాత్రమే ఉంటుందని త్వరలో కొత్త భవన నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో దాని నిర్మాణం చేయటం కోసం ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

ఉపరాష్ట్రపతిని అవమానించడం సిగ్గుచేటు


కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మాధవరం కాంతరావు

కూకట్‌పల్లి: పార్లమెంటు సమావేశాల్లో సస్పెండ్ అయిన ప్రతిపక్ష ఎంపీలలో ఒకరైన బెనర్జీ రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌ను ఎగతాళి చేస్తున్న దృశ్యాలను రాహుల్ గాంధీ తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేయడానికి ఖండిస్తున్నామని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు అన్నారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం ఎదుట అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీరుకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిపక్ష పార్టీల చర్యలు ముఖ్యంగా టీఎంసీ, కాంగ్రెస్ పార్టీల తీరు యావత్ దేశం సిగ్గుపడేలా చేసిందని అన్నారు. ఉప రాష్ట్రపతిని అవహేళన చేయటం, అవమానించటం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి తగదన్నారు. టీఎంసీ, కాంగ్రెస్ పార్టీల ఎంపీలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, నాయకులు శ్రీకర్‌రావు, సూర్యప్రకాష్‌రావు, సురేందర్‌రెడ్డి, మనోహర్, రవికుమార్ గౌడ్, సత్యమూర్తి, వినోద్ కుమార్‌గౌడ్, వినోద్, శ్రీనివాస్, మల్లేష్, సుగుణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యే కృష్ణారావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగానగర్‌లోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీన వైకుంఠ ఏకాదశికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వార దర్శనానికి రావాల్సిందిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు గురువారం ఆలయ పాలక కమిటీ సభ్యులు, కార్యనిర్వహణ అధికారి కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వీఎస్‌వీ సత్యనారాయణ, పాలక కమిటీ సభ్యులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ది చెన్నై సిల్క్స్‌లో శారీ మేళా

మూసాపేట: కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద ది చెన్నై సిల్క్స్‌లో గురువారం వరల్డ్ శారీ డే సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శారీ మేళాను ప్రారంభించారు. సరికొత్త డిజైన్స్ అందుబాటులోఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంఆర్ మహేష్, మేనేజర్‌లు త్యాగరాజన్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బండి రమేష్‌కు శుభాకాంక్షలు


బండి రమేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాగిరెడ్డి, కొండల్‌రెడ్డి

మూసాపేట: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన బండి రమేష్‌కు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి గురువారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ... రాబోయే కాలంలో ప్రభుత్వం చేసే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తను భాగస్వాములను చేయాలని కోరారు. మన ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సీహెచ్. కొండల్‌రెడ్డి పాలొన్నారు.

అవంతినగర్ ఈస్ట్ కాలనీ సమస్యలను పరిష్కరించండి


డీసీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు లయన్ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ ఈస్ట్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మూసాపేట డీసీ రమేష్‌కు గురువారం సంక్షేమ సంఘం అధ్యక్షుడు లయన్ అన్నెం కోటిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు పెరిగి పెద్దవై విద్యుత్ వైర్లకు తగలటంతో తరచూ షార్ట్ సర్క్యూట్ అవుతోందన్నారు.

◆ చెట్లు పెద్దవి కావటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైందని తెలిపారు. అదే విధంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డీసీ స్పందిస్తూ ఆయా సంబంధిత శాఖ అధికారులతో ప్రణాళిక వేయించి నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రధాన కార్యదర్శి టి. దేవేందర్ రావు, సభ్యులు ఎల్లంబరెడ్డి, పి. మల్లయ్య, సీహెచ్. రామచందర్, బుద్ధబాబు తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పట్టించుకోండి




ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 నల్లపోచమ్మ దేవాలయం వద్ద పారుతున్న మురుగు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ టులోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం వద్ద సుమారు వారం రోజులుగా మురుగు పారుతోంది. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యంగా ఉంటోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇదే రహదారిపై వెళ్లే అధికారులు, ప్రజాప్రతినిధులకు మురుగు కనిపించటం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రిన్సిపాల్ నూతన కార్యాలయం ప్రారంభం

బాలానగర్: జేఎన్‌టీయూలోని ఐఎస్‌టి బిల్డింగ్‌లో గురువారం నూతన ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని వైస్‌చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనది సాంకేతిక యూనివర్సిటీ కాబట్టి ముందు మనం మన వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగంలోకి తెచ్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ కార్యాలయం సకల సౌకర్యాలతో ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డా. కె. విజయకుమార్‌రెడ్డి కళాశాలలో అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. మంజూర్ హుసేన్, రెక్టార్ డా. గోవర్ధన్, డా. తార కళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ డా. జీవీ నర్సింహారెడ్డి, హెచ్‌ఓడీలు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, జాయింట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డి, టీచింగ్, నాన్‌టీచింగ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలను పరిష్కరిస్తా


పర్వత్‌నగర్‌లోని పీహెచ్‌సీని సందర్శిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేటర్ సబిహా బేగం గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో పలు సమస్యలపై డ్యూటీ వైద్యులు విజయచంద్రను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్లంబింగ్ వర్క్, వార్డులో విద్యుత్ దీపాలు వెలగకపోవటం వంటి సమస్యలు ఉన్నాయని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నిటికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఆశావర్కర్లు, కోఆర్డినేటర్ వీరారెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహెద్ షరీఫ్ బాబా, రాజు, శ్రీనివాస్ యాదవ్, గంగపుత్ర శంకర్, రాములు యాదవ్, బ్రహ్మం, వెంకటమ్మ, రేవతి, లక్ష్మీ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీయడమే 'సృజన టెక్‌ఫెస్ట్' లక్ష్యం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎస్ ఎక్బాల్‌హుస్సేన్

రాయదుర్గం: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం సృజన టెక్‌ఫెస్ట్ ఏర్పాటు చేసిందని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ప్రిన్సిపల్ ఎస్ ఎక్బాల్ హుస్సేన్ పేర్కొన్నారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం సృజన టెక్‌ఫెస్ట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ నైపుణ్యంతో రూపొందించి ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పోటీలను ఏర్పాటు చేసి ఇందులో అత్యుత్తమ ప్రాజెక్టులను గుర్తించి వాటిని రాష్ట్ర స్థాయి సృజన టెక్‌ఫెస్ట్‌లో ప్రదర్శించేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. రంగారెడ్డి జిల్లా స్థాయిలో జీఐఎల్‌టీ నుంచి రెండు ప్రాజెక్టులను ఎంపిక చేయడం జరిగిందని వాటిని రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలను జనవరి 2024 మొదటి వారంలో ఏర్పాటు చేస్తారన్నారు. జీఐఎల్‌టీ నుంచి ప్రదర్శించిన ప్రాజెక్టులలో జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో 'రిప్లేసబుల్ ప్లగ్ సిస్టమ్–స్మార్ట్ ఆర్థోపెడిక్ ఫుట్‌వేర్ ఫర్ పీస్ కేవస్ స్వాలోన్‌ఫీట్, డయాబెటీస్, బర్న్స్, ఆర్థిరిటీస్'పేరిట రూపొందించిన ప్రాజెక్టు మొదటి స్థానంలో నిలువడం విశేషం. ఈ కార్యక్రమంలో జీఐఎల్‌టీ ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్ బీవీబీ విద్యార్థుల జాతీయ స్థాయిలో ప్రతిభ



సాక్షి, హైదరాబాద్ : బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యాభవన్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరిశారు. చెన్నైకి చెందిన 'విశ్వాస్ చారిటబుల్ ట్రస్ట్' నిర్వహించిన జాతీయ స్థాయి విష్ణు సహస్రనామ పఠన పోటీ, చిత్రలేఖనంలో జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల సంస్కృత అధ్యాపకురాలు జగన్మోహిని నేతృత్వంలో విద్యార్థులు శ్రేయస్ ముకుంద్, షణ్ముఖ సాత్విక్, వార్షిక విష్ణు సహస్రనామ వార్షిక పఠన పోటీలో ద్వితీయ స్థానంలో నిలవగా.. చిత్రలేఖనంలో విజువల్ ఆర్ట్ ఉపాధ్యాయులు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహితీ క్షీరసాగర్, సంజుక్త బెనర్జీ ప్రథమ స్థానంలో, మీనాక్షి ద్వితీయ, దేబవర్ష మాండల్ తృతీయ స్థానంలో నిలిచారు. వారికి పాఠశాల ప్రిన్సిపాల్ చేబోలు ఉమా, వైస్ ప్రిన్సిపాల్ వాణి అభినందనలు తెలిపారు.

పదో విడత హరిత హారానికి కసరత్తు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఉపాధి హామీ పథకం కింద ఇప్పటి వరకు తొమ్మిది విడతలుగా హరితహారాన్ని నిర్వహించారు. వచ్చే ఏడాది జూన్‌లో పదో విడత హరితహారం చేపట్టనున్నారు. వచ్చే వానాకాలంలో నిర్వహించే ఈ కార్యక్రమం కోసం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2024–25 సంవత్సరంలో 65.20 లక్షల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 61 గ్రామ పంచాయతీలు, 13 పురపాలక సంఘాల్లో మొత్తంగా 74 ప్రాంతాల్లో నర్సరీల్లో ఈ మొక్కలు ఉత్పత్తి అయ్యేలా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. 61 గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను గ్రామీణ అభివృద్ధి సంస్థ చూస్తుండగా, మిగతా ప్రాంతాల్లోని నర్సరీలను అటవీశాఖ, పురపాలక సంఘాలు పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందించారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి అవసరమైన ఎర్రమట్టిని కొన్ని గ్రామాలు, పట్టణాల్లో తెప్పించారు. ఆ మట్టిని జల్లెడపట్టి పాలిథిన్ సంచుల్లో నింపుతున్నారు. గత ఏడాది మిగిలిన వాటిని పెద్ద పాలిథీన్ సంచుల్లోకి మారుస్తున్నారు.

ఔషధ మొక్కలకు ప్రాధాన్యం

ఎవరికి ఏ మొక్కలు కావాలో గ్రామాలు, పురపాలికల్లో సర్వే చేయాలని అధికారులు సంబంధిత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధలకు సూచించారు.వాటితో పాటు ఔషధ మొక్కలు, రోడ్ల వెంట నాటడానికి పెద్దగా పెరిగే చెట్లకు సంబంధించిన మొక్కలను నర్సరీల్లో పెంచాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే తొమ్మిది విడతలుగా ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేసి వాటిని పెంచుతున్న నేపథ్యంలో ఈ సారి వాటిని తగ్గిస్తున్నారు. రహదారికి ఇరువైపులా నాటేందుకు అవసరమైన మొక్కలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇళ్లలో పెంచుకునేందుకు జామ, నిమ్మ, తులసిలాంటి ఔషధ మొక్కలు పెంచాలని నిర్ణయించారు. వీటితో పాటు అల్లనేరేడు, చింత, వేప, నీడతో పాటు వివిధ రకాల పూలతో ఆకట్టుకునే మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి హామీ నిధులతో వచ్చే ఏడాది జూన్ నుంచి చేపట్టనున్న హరితహారానికి ఇప్పటి నుంచే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన మొక్కలు పెంచేందుకు నర్సరీల్లో పనులు ముమ్మరం చేశారు. నర్సరీల్లో మిగిలిన మొక్కలను సంరక్షిస్తూనే కొత్తగా మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మట్టి నింపిన సంచుల్లో..

హరితహారం ద్వారా మొక్కలు నాటేందుకు నర్సరీలు ఏర్పాటు చేసిన సంబంధిత అధికారులు డిసెంబర్ నుంచే సంచుల్లో మట్టిని నింపి విత్తనాలు నాటేలా చర్యలు తీసుకుంటున్నారు. చలికాలంలో విత్తనాలు నాటితే మొలకలు బాగా వస్తాయని భావిస్తున్న యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. గ్రామస్తులు, పట్టణవాసులకు అవసరమైన మొక్కల కోసం సర్వే చేసి నర్సరీలు ఏర్పాటు చేయాలని సంబంధిత ప్రజాప్రతినిధులకు జిల్లా అధికార యంత్రాంగం సూచిస్తోంది.